మద్యం విక్రయాలు జరిపితే చర్యలు

హుజూరాబాద్ ఎక్సైజ్ సీఐ దుర్గాభవాని

హుజూరాబాద్: ఎన్నికల కోడ్ అమల్లో నేపథ్యంలో అక్రమంగా మద్యం సరఫరా, విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని హుజూరాబాద్ ఎక్సైజ్ సీఐ దుర్గాభవాని అన్నారు. పట్టణ పరిధిలోని పర్కాల్ క్రాస్ రోడ్డు చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం, గుడుంబా తయారీకి వినియోగించే బెల్లం పానకం నిల్వలు, బెల్టుషాపులపై దాడులు జరిపి కేసులు నమోదు చేశామని తెలిపారు. 611 లీటర్ల మద్యం, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని, గ్రామాల వారీగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. మద్యం అమ్మకాలు, నిల్వలు తెలిస్తే 8712658811, 8019263862 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు

జమ్మికుంట: అక్రమ మద్యం తరలింపుపై చర్యలు తీసుకుంటామని జమ్మికుంట ఎక్సైజ్ సీఐ అక్బర్ హుస్సేన్ హెచ్చరించారు. పట్టణంలో బుధవారం మాట్లాడారు. మద్యం స్థావరాలపై దాడులు చేసి కేసులు నమోదు చేశామని, 190 లీటర్ల నాటుసారా, బెల్లం పానకం, 576 కిలోల బెల్లం, 278 లీటర్ల మద్యం బాటిళ్లు, మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి 130 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. అమ్మకం, తయారీ, నిల్వలు, తరలింపు సమాచారం తెలిస్తే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసులు, తదితరులున్నారు.


హుజూరాబాద్: వాహనాలు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

మద్యం, బైక్ పట్టివేత


పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు, బైక్

తిమ్మాపూర్: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మానకొండూరు మండలం కొండపలకల గ్రామంలో బుధవారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై 27 మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. మద్యం, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐలు సరిత, శ్రీకాంత్ సిబ్బంది కొండల్ రెడ్డి, రాజేశం, నరేశ్, సురేశ్, రజిత పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేసీఆర్ పాలనలో జిల్లాకో మెడికల్ కాలేజీ


మాట్లాడుతున్న వినోద్‌కుమార్

చొప్పదండి: జిల్లాకో మెడికల్ కాలేజీ సీఎం కేసీఆర్ పాలనలోనే సాధ్యమైందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. చొప్పదండి పట్టణంలో బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమానికి వినోద్‌కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో వైద్య విద్య అభివృద్ధి ప్రగతికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వీర్ల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి స్నేహితుల ఆర్థికసాయం


నగదు అందిస్తున్న స్నేహితులు

జమ్మికుంట: పట్టణానికి చెందిన మహదేవుని భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 1989–90 పదో తరగతి విద్యార్థులు బుధవారం మృతుడి భార్య దుర్గాభవాని, కుటుంబ సభ్యులకు రూ.20వేలు అందజేశారు. ఈకార్యక్రమంలో గుడివాడ సతీశ్, అయిత కృష్ణమూర్తి, శ్రీనివాస్, మంచాల రాంబాబు, అయిత రాధాకృష్ణ, దొడ్డె శ్యామ్, కొండ్లె నగేశ్, రాజు, రావికంటి శ్రీధర్, శ్రీమోజు రాజేంద్రప్రసాద్, మహదేవుని శేఖర్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటాల పంపిణీ


చిత్రపటాలను పంపిణీ చేస్తున్న నాయకులు

జమ్మికుంట: పట్టణంలో నాయీబ్రాహ్మణ వైద్య నారాయణ ధన్వంతరీ చిత్రపటాలను హుజూరాబాద్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో జమ్మికుంట టౌన్ గౌరవ అధ్యక్షుడు సమ్మెట లింగయ్య, సంఘం సభ్యులకు బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో ఈ నెల 10న వైద్య నారాయణ ధన్వంతరీ జయంతి వేడుకలు నిర్వహిస్తామని, నాయీబ్రాహ్మణులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మురహరి రాజు, గౌరవ అధ్యక్షుడు నారాయణదాస్ కార్తీక్, ప్రధాన కార్యదర్శి తూముల శ్రావణ్, కోశాధికారి జంపాల రితేశ్, ఉపాధ్యక్షుడు బిజ్జిగిరి శ్రీనివాస్, సమ్మెట సారయ్య, సమ్మెట అచ్యుత్ తదిరులు పాల్గొన్నారు.

‘అభివృద్ధి పనులను అడ్డుకోవద్దు’

హుజూరాబాద్‌రూరల్: ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు చేపట్టిన పనులను ఎలక్షన్ కోడ్ సాకుగా చూపుతూ అడ్డుకోవడం సరికాదని చెల్పూర్ సర్పంచ్ నేరెళ్ల మహేందర్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. గ్రామంలోని ఎస్సీకాలనీలో అభివృద్ధి పనులకు అగ్రిమెంట్ పూర్తి చేసుకొని ఎలక్షన్ నోటిఫికేషన్‌కు ముందే ఎర్త్ వర్క్స్ పూర్తి చేసి ముడి సామగ్రి తెచ్చుకున్నామని, హుజూరాబాద్ ఏఈ ఎలక్షన్ కోడ్‌ను సాకుగా చూపి పనులను నిలిపివేశామని చెబుతున్నారని, పనులు పూర్తి చేసిన ఎంబీ రికార్డు చేయమంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలిపారు. ప్రతిపక్ష పార్టీ సర్పంచ్ కావడం వల్లే ఈవిధంగా చేస్తున్నాడని పేర్కొన్నారు. పనులు పూర్తి చేయడానికి అధికారులు అనుమతులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో రంగాపూర్ సర్పంచ్ కరుణాకర్, తదితరులు ఉన్నారు.

ఉద్యోగులకు సన్మానం



విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ ఆర్టీసీ టూ డిపో పరిధిలో అక్టోబర్ నెలలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు కేజీ సాగర్, వి.రాజన్న, డ్రైవర్లు డీఎం రెడ్డి, పి.అశోక్‌రావు, కె.శంకరయ్య, కండక్టర్ వినోదను ఆ డిపోలో బుధవారం డిపో మేనేజర్ మల్లయ్య ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయలక్ష్మి, సూపరింటెండెంట్ కమల, శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్ మెకానికల్ తిరుపతి పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ


డ్యాన్స్ చేస్తున్న బొమ్మనపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థినులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీ పాఠశాల ఎనిమిది, తొమ్మిదో తరగతికి చెందిన విద్యార్థిను తెలంగాణ రాష్ట్ర పాపులేషన్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి జానపద నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచారు. బుధవారం కరీంనగర్‌లోని ఫిల్మ్‌భవన్‌లో యువత మత్తుపానీయాలు సేవించడం వల్ల జరిగే అనర్థాలపై నిర్వహించిన జానపద పాటకు విద్యార్థులు చేసిన నృత్యానికి జిల్లాస్థాయి ప్రథమ బహుమతి వచ్చింది. అలాగే విద్యార్థినులు రాష్ట్రస్థాయి నృత్య పోటీలకు ఎంపికయ్యారు. పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థినులు చట్ల జశ్విద, పడాల ఉషశ్రీ, మాచమల్ల కృతి, కస్తూరి అర్చన, ఎనిమిదో తరగతి విద్యార్థినులు మామిడి హర్షిత, కొండబత్తిని సమన్విత, దేశిని అనుశ్రీ, పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి సీహెచ్ వీఎస్ జనార్దన్‌రావు, హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు విద్యార్థినులను అభినందించారు.

ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

- హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి
- పట్టణంలో కేంద్ర బలగాల కవాతు


హుజూరాబాద్‌లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

హుజూరాబాద్: ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలనీ హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని హుజూరాబాద్ పట్టణంలో బుధవారం జెండా ఊపి ఫ్లాగ్ మార్చ్, కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ..దాదాపు 123 మంది పోలీసులతో 4.5 కిలోమీటర్ల మేర కవాతు నిర్వహించామన్నారు. కవాతులో కేంద్ర సాయుధ బలగాలతో పాటు జిల్లా, స్థానిక పోలీసులు, అధికారులు, డాగ్ స్క్వాడ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీమ్స్ పాల్గొన్నాయని, భద్రత ఏర్పాట్లలో భాగంగా కేంద్ర సాయుధ బలగాలను జిల్లాకు కేటాయించారన్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు బలగాలు జిల్లా అధికారులతో కలిసి పని చేస్తాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని భద్రతా దృష్ట్యా ఎనిమిది కేంద్ర సాయుధ బలగాలు జిల్లాకు కేటాయించగా ఇప్పటికే మూడు కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయన్నారు. వీరిని ప్రస్తుతానికి హుజూరాబాద్, చొప్పదండి, కరీంనగర్‌కు కేటాయించామన్నారు. ప్రజల్లో ఎన్నికల నియమావళి, ఉల్లంఘనలపై అవగాహన, డయల్ 100, 1950 టోల్ ఫ్రీ నంబర్, సీ–విజిల్ ఆప్‌లపై అవగాహన కల్పించామన్నారు. ఫ్లాగ్‌మార్చ్ ముఖ్య ఉద్దేశం, ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేలా భద్రతా భావం కల్పించడమే కాకుండా చట్టం, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారికి ప్రజల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి హెచ్చరించామని పేర్కొన్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహించి, నంబర్ ప్లేట్, సరైన ధ్రువపత్రాలు లేని 21 వాహనాలను సీజ్ చేశామనీ తెలిపారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ ఏసీపీ అనూజ్‌కుమార్, హుజూరాబాద్ టౌన్ సీఐ బొల్లం రమేశ్, జమ్మికుంట టౌన్ సీఐ రమేశ్, జమ్మికుంట రూరల్ సీఐ కె.కిశోర్, హుజూరాబాద్‌రూరల్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్సైలు ఎండీ అసిఫ్, రాజ్‌కుమార్, డివిజన్‌లోని ఎస్సైలు, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభకు తరలిరావాలి


సింగాపూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు కోసం హైదరాబాద్‌లో 11న నిర్వహించే మాదిగ విశ్వరూప మహాసభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. తుమ్మనపల్లి, మాందాడిపల్లి, సింగాపూర్ గ్రామాల్లో బుధవారం సభకు సంబంధించిన కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. సభకు ఏపీ, తెలంగాణ నుంచి వేలాది మందితరలి వస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా కన్వీనర్ రామచంద్రం, కో కన్వీనర్ మారెపల్లి శ్రీనివాస్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి తునికి వసంత్, నాయకులు పాల్గొన్నారు.

గంగాధర: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కోసం 11న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభకు తరలిరావాలని ఎమ్మార్పీయస్ నాయకులు పిలుపునిచ్చారు. మహాసభకు సంబంధించిన పోస్టర్ మండలంలోని ర్యాలపల్లి గ్రామంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బచ్చలకూరి వెంకటేశ్వర్లు, బెజ్జంకి అనిల్, నర్సయ్య, ఎల్లయ్య, ఎలగందుల మల్లయ్య, గసికంటి అమృత, సామర్ల అమృత, బెజ్జంకి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


గంగాధర మండలంలోని ర్యాలపల్లి గ్రామంలో పోస్టర్ ఆవిష్కరణ

పోలింగ్ కేంద్రాలకు నంబర్లు

కరీంనగర్‌రూరల్: శాసనసభ ఎన్నికలకు అధికారులు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ఈనెల 30న నిర్వహించే పోలింగ్ సందర్భంగా ఓటేసేందుకు వచ్చే ఓటర్లకు తమ పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో తెలిసేలా చర్యలు చేపట్టారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్నవాళ్లతో పాటు జాబితాలో మార్పులు చేసుకున్నవారు కేంద్రాలను గుర్తించేలా పోలింగ్ కేంద్రం ఎదుట గుర్తింపు నెంబర్లను వేయిస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 390 పోలింగ్ కేంద్రాలుండగా.. కరీంనగర్ రూరల్‌లో 66, కరీంనగర్ కార్పొరేషన్‌లో 263, కొత్తపల్లి మండలంలో 61 ఉన్నాయి. ఎన్నికల సంఘం కరీంనగర్ నియోజకవర్గానికి గుర్తింపు సంఖ్య 26 కేటాయించింది. 4రోజుల నుంచి ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు అందరికీ కనబడేలా సంఖ్య రాయిస్తున్నారు. కేంద్రాల్లో గోడలపై మీద పోలింగ్ కేంద్రం సంఖ్య, కింద అసెంబ్లీ నియోజకవర్గం సంఖ్య వేశారు.


మొగ్దుంపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పోలింగ్ కేంద్రం నంబరు వేయిస్తున్న అధికారులు

అయ్యప్ప ఆలయంలో కొటేషన్లకు ఆహ్వానం

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప ఆలయంలో దీక్షలను పురస్కరించుకొని దీక్షా సమయంలో అన్నదానం, టీ, అల్పాహారం ఏర్పాటు చేసేందుకు పాలు, పెరుగు, నెయ్యి సరఫరాకు కొటేషన్లను ఆహ్వానిస్తున్నట్లు ఈవో కొన్న కాంతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆలయంలో సంప్రదించాలని కోరారు.

వెంకన్న ఆలయంలో టెండర్లకు ఆహ్వానం

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని మార్కెట్ రోడ్ వేంకటేశ్వరాలయంలో 2024 నుంచి 2025 వరకు ఒక సంవత్సరం కాలపరిమితికి గాను టెంకాయలు, వాహన పూజలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు బహిరంగ వేలంలో భాగంగా టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఈవో ఉడుతల వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న మధ్యాహ్నం 12 గంటలకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు, ఆసక్తి ఉన్నవారు వివరాలకు ఆలయంలో సంప్రదించాలని సూచించారు.

అవినీతి రహిత పాలనందిస్తా


నామినేషన్ దాఖలు చేస్తున్న జోజిరెడ్డి

కరీంనగర్: కరీంనగర్ అసెంబ్లీకి పోటీ చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులంతా ఒక్కటేనని, అవినీతిలో వారంతా భాగస్వాములేనని, తనకు ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశమిస్తే అవినీతి రహిత పాలనందిస్తానని ఏఐఎఫ్‌బీ కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థి అంబటి జోజిరెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం కలెక్టరేట్ ఎదుట మీడియా పాయింట్‌లో మాట్లాడారు. సమ సమాజ స్థాపన కోసం అవినీతి నేర రహిత పాలన కోసం ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని బలపర్చాలని కోరారు. నాయకులు గవ్వ వంశీధర్‌రెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌ను పీవీ జిల్లాగా ఏర్పాటు చేయాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న శ్యాంసుందర్

శంకరపట్నం: హుజూరాబాద్‌ను పీవీ జిల్లాగా ఏర్పాటు చేయాలని జిల్లా సాధన సమితి మండల కన్వీనర్ బాణాల శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం కరపత్రాలను ఆవిష్కరించారు. 14 మండలాలతో హుజూరాబాద్‌ను జిల్లా చేయాలన్నారు. హుజూరాబాద్‌లో అన్ని ప్రభుత్వ డివిజన్ కార్యాలయాలు, సీనియర్, జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులున్నాయని, పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం జిల్లాగా ఏర్పాటు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో కొరిమి వెంకటస్వామి, సయ్యద్ ఆరిఫ్, వీరమల్లు, సమ్మయ్య, మంకయ్య, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు


పరీక్షలు చేస్తున్న పశువైద్యులు

తిమ్మాపూర్: మండలంలోని పొరండ్ల, మల్లాపూర్ గ్రామాల్లో బుధవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. 65 గేదెలు, 80 ఆవులకు వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పాడి పశువుల పునరుత్పత్తి వ్యవస్థ లోపాల పునరుద్ధరణ నైపుణ్యాల పెంపొందింపు అంశంపై తెలంగాణా రాష్ట్ర పశు వైద్యాధికారులకు పదిరోజుల పాటు కరీంనగర్ ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణా కేంద్రంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేశామని మండల పశువైద్యాధికారి సురేందర్ రెడ్డి తెలిపారు. శిబిరంలో శిక్షణా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. లింగారెడ్డి, డాక్టర్ జి.విజయకుమార్ శర్మ, ఎస్‌పీరెడ్డి, రాజిరెడ్డి, శిక్షణా కేంద్రం అధ్యాపకులు ఎం. కోటేశ్వరరావు, సాయిచైతన్య, దివ్య, మండల పశువైద్య సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోట్రాలీ – బైక్ ఢీ

- ఒకరికి గాయాలు

శంకరపట్నం: మండల కేంద్రంలోని రైస్‌మిల్ సమీపంలో ఆటోట్రాలీ – బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన నక్క మొండయ్య పని నిమిత్తం శంకరపట్నం వచ్చాడు. తిరుగు ప్రయాణంలో కరీంపేట నుంచి కేశవపట్నం వైపు వస్తున్న ఆటోట్రాలీ బైక్‌ను ఢీకొట్టింది. బైక్ మీది నుంచి కిందపడిన మొండయ్యకు గాయాలు కావడంతో 108 వాహనంలో కరీంనగర్ హాస్పిటల్‌కు తరలించారు.



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

గంగాధర: ప్రధాన రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు స్తంభాలతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మండలంలోని మధురానగర్ చౌరస్తా నుంచి బోయినపల్లి వరకు ఇటీవల డబుల్‌రోడ్డు నిర్మాణం చేపట్టారు. చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి దాదాపు కిలో మీటరు వరకు రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించారు. బోయినపల్లి రోడ్డు కుడివైపు దారిని ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలను తొలగించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

